# కేసీఆర్ కార్యాలయంపై దాడి.. యావత్ తెలంగాణపై జరిగినట్లే!

- గజ్వేల్ ఘటనపై బీఆర్ఎస్ వేములవాడ ఇంచార్జ్ చల్మెడ ఆగ్రహం
- ఇదేనా మీ ప్రజా పాలన? రేవంత్ సర్కార్‌పై ధ్వజం

**ప్రజానావ, వేములవాడ:** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని కేవలం ఒక కార్యాలయంపై జరిగిన దాడిలా చూడలేమని, ఇది యావత్ తెలంగాణ సమాజంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి తెగబడటం అత్యంత దారుణమని చల్మెడ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గుండాయిజం పరిపాలనను ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపభూయిష్టంగా మారాయని ఆరోపించారు. "ప్రజలకు మీరు అందిస్తున్న ప్రజా పాలన ఇదేనా?" అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. గజ్వేల్ ఘటన రాష్ట్రంలో నెలకొన్న అరాచక పరిస్థితులకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రజల వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకే..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చల్మెడ విమర్శించారు. హామీల అమలుపై ప్రజల నుండి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే (డైవర్షన్ పాలిటిక్స్) కాంగ్రెస్ నేతలు హింస రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. హింస ద్వారా ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం కాంగ్రెస్ అహంకారానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.

### మరోసారి జరిగితే సహించం!

ఇలాంటి దాడులను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని,



తగిన సమయంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని చల్మెడ హెచ్చరించారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ కార్యాలయాలపై కానీ, నాయకులపై కానీ ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకోబోమని, గట్టిగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించాలే తప్ప, దాడులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం సరికాదని హితవు పలికారు.

# నాసిక్‌లో ఘోర ప్రమాదం



- బావిలో పడ్డ కారు.. తొమ్మిది మంది మృతి
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు..
- ఒకే కుటుంబంలో ఐదుగురు దుర్మరణం
- ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. దిండోరి తాలూకా శివాజీనగర్ ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న కారు అదుపుతప్పి నీటితో నిండిన బావిలో పడిపోవడంతో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు పాఠశాల విద్యార్థులు ఉండటం స్థానికులను కలచివేస్తోంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇండోర్ గ్రామానికి చెందిన సునీల్ దత్తు దర్గోడే తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఒక ప్రైవేట్ క్లాస్ రీయూనియన్ కార్యక్రమానికి హాజరయ్యారు. వేడుక ముగించుకొని తిరిగి వస్తుండగా, దిండోరి నగర శివార్లలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో మారుతి సుజుకి ఎర్టిగా (ఎంహెచ్15 జేఎస్1053) కారు వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న లోతైన బావిలో పడిపోయింది. కారు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో లోపల ఉన్న వారికి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే బావిలో నీరు ఎక్కువగా ఉండటం, చీకటి కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. చివరకు క్రేన్ సహాయంతో కారును బయటకు తీసేసరికి లోపల ఉన్న వారందరూ విగతజీవులుగా పడి ఉన్నారు. మృతులను సునీల్ దత్తాత్రయ్ (32), రేష్మా (27), ఆశా (32), చిన్నారులు గుణవతి (11), శ్రేయాష్ (11), శ్రావణి (11), రాజ్‌శ్రీ (14), రాజ్‌శ్రీ (7), దర్గోడ్ (13)గా గుర్తించారు. వీరిలో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఇండోర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్ర అజిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అమాయక విద్యార్థులతో సహా తొమ్మిది మంది మరణించడం హృదయ విదారకమని ఆమె పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

# ధారాశివ్ జిల్లాలో 'డిజిటల్ ఫాస్టింగ్'

## రాత్రి 7 నుండి 9 వరకు నో టీవీ.. నో మొబైల్!


- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అర్చన పాటిల్ కీలక నిర్ణయం
- నిబంధనలు ఉల్లంఘిస్తే గస్తీ బృందాల తనిఖీ.. గ్రామాల్లో మోగనున్న సైరన్లు



**ప్రజానావ, ముంబై:** పెరుగుతున్న 'స్క్రీన్ టైమ్', సోషల్ మీడియా వ్యామోహం నుంచి విద్యార్థులను బయటపడేసి, వారి చదువుపై దృష్టి సారించేలా చేసేందుకు ధారాశివ్ జిల్లా పరిషత్ ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు టీవీలు, మొబైల్ ఫోన్లను పూర్తిగా ఆపివేయాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అర్చన పాటిల్ విజ్ఞప్తి చేశారు. కేవలం విజ్ఞప్తితోనే సరిపెట్టకుండా, దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు.

### సైరన్ మోగగానే పుస్తకాలు పట్టాల్సిందే!

ఈ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడానికి గ్రామాల్లోని దేవాలయాలు లేదా పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక హారన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి 7




గంటలవ్వగానే ఈ హారన్ మోగుతుంది. అది మోగిందంటే విద్యార్థులు టీవీలు, మొబైల్స్ పక్కన పెట్టేసి పుస్తకాలు పట్టాలని అర్థం. గతంలో బహిరంగ మలవిసర్జనను అడ్డుకోవడానికి పనిచేసిన 'గుడ్ మార్నింగ్' బృందాల తరహాలోనే, ఇప్పుడు విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు గ్రామాల్లో గస్తీ తిరుగుతాయి. రాత్రి 7 నుండి 9 గంటల మధ్య ఇళ్లలో టీవీలు ఆపి ఉన్నాయా లేదా, పిల్లలు చదువుకుంటున్నారా అనే అంశాలను ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేస్తాయి.

### అందుబాటులో స్టడీ రూమ్‌లు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి పెద్ద గ్రామ పంచాయతీలో అన్ని సౌకర్యాలతో కూడిన 'అభ్యాస గదులను' (స్టడీ రూమ్స్) ప్రారంభించనున్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత కూడా చదువులో సందేహాలు ఉన్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచనున్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని అర్చన పాటిల్ పేర్కొన్నారు.

### తల్లిదండ్రుల సహకారం అత్యవసరం

పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కూడా త్యాగం చేయాలని అధ్యక్షురాలు కోరారు. "పిల్లలు చదువుకునే ఆ రెండు గంటల సమయం తల్లిదండ్రులు కూడా టీవీ చూడటం మానుకోవాలి. ఇది కేవలం ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, యావత్ సమాజం భాగస్వామ్యం కావాల్సిన సామాజిక బాధ్యత" అని ఆమె పిలుపునిచ్చారు. విద్యావేత్తలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, ఇళ్లలోకి వచ్చి టీవీలు ఆపివేయడంపై ప్రజల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.






# బాలికపై అఘాయిత్యం

### కామాంధుడైన ప్రిన్సిపాల్‌కు 'యావజ్జీవం'
### నేరానికి సహకరించిన క్లాస్ టీచర్‌కు జైలు శిక్ష..
### నాసిక్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

**ప్రజానావ, ముంబై:** విద్య నేర్పించి ప్రయోజకులను చేయాల్సిన గురువే భక్షకుడిగా మారిన ఘటనలో నాసిక్ జిల్లా కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన స్కూల్ ప్రిన్సిపాల్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పీవీ ఘులే తీర్పు చెప్పారు. నిందితుడికి సహకరించడమే కాకుండా, జరిగిన దారుణాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన తోటి ఉపాధ్యాయుడికి కూడా జైలు శిక్ష విధిస్తూ కోర్టు నేరస్థుల్లో వణుకు పుట్టించింది. సమాజంలో గురువుల పట్ల నమ్మకాన్ని వమ్ము చేసిన ఈ ఘటనలో న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ దారుణం 2025 ఫిబ్రవరి 7న ఇగత్‌పురి తాలూకాలోని ఒక పాఠశాలలో చోటుచేసుకుంది. నిందితుడైన ప్రిన్సిపాల్ తుకారాం సాబ్లే (53), గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు గోరఖ్‌నాథ్ జోషి (43)కి ఫోన్ చేసి, ఒక 13 ఏళ్ల బాలికను తన ఇంటికి పంపాలని కోరాడు. "మీ అమ్మమ్మ వచ్చింది, సాబ్లే సార్ ఇంటికి వెళ్లు" అని ఉపాధ్యాయుడు అబద్ధం చెప్పి ఆ బాలికను ఒంటరిగా ప్రిన్సిపాల్ నివాసానికి పంపాడు. అక్కడ ఆ బాలిక అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న సాబ్లే, ఆమెపై పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాధితురాలు పాఠశాలకు చేరుకుని జరిగిన విషయాన్ని క్లాస్ టీచర్ జోషికి వివరించినప్పటికీ, అతను ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా ఫిర్యాదు చేసేందుకు కూడా సహాయం చేయకపోవడంతో పాటు ఆ దారుణాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఈ విషయం ఘోటి పోలీసుల దృష్టికి రావడంతో అప్పటి ఇన్‌స్పెక్టర్ వినోద్ పాటిల్ వేగంగా స్పందించి నిందితులిద్దరినీ అరెస్ట్ చేశారు. పక్కా ఆధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం నేరాన్ని ధ్రువీకరించింది. ప్రధాన నిందితుడు తుకారాం సాబ్లేకు పోక్సో చట్టం కింద యావజ్జీవ కారాగార శిక్షతో పాటు మొత్తం రూ. 2.50 లక్షల జరిమానాను ఖరారు చేసింది. రెండవ నిందితుడైన ఉపాధ్యాయుడు గోరఖ్‌నాథ్ జోషిని కూడా దోషిగా నిర్ధారిస్తూ, నేరాన్ని దాచడం, సహకరించినందుకు పోక్సో చట్టంలోని సెక్షన్ 21 కింద ఏడాది పాటు జైలు శిక్ష, రూ. 68 వేల జరిమానా విధించింది. ప్రభుత్వ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన అడ్వకేట్ లీనా చవాన్ వాదనలు, పోలీసుల పకడ్బందీ దర్యాప్తు కారణంగానే బాధితురాలికి న్యాయం జరిగిందని ఇగత్‌పురి తాలూకా ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# నాందేడ్‌లో గ్యాంగ్ వార్

### అర్ధరాత్రి రక్తపాతం.. ముగ్గురి హత్య!
### వీధిలో మొదలైన గొడవ ఆసుపత్రికి చేరిక..
### ముఠా నాయకుడి హత్యకు ప్రతీకారంగా ఆసుపత్రిలో చొరబడి ఇద్దరిని నరికేసిన వైనం



**ప్రజానావ, ముంబై:** కొంతకాలంగా నేరాలకు అడ్డాగా మారుతున్న నాందేడ్ నగరం శుక్రవారం అర్ధరాత్రి గ్యాంగ్ వార్‌తో వణికిపోయింది. పాత కక్షల నేపథ్యంలో రెండు వర్గాలు పరస్పరం దాడులకు తెగబడటంతో ముగ్గురు రౌడీషీటర్లు ప్రాణాలు కోల్పోయారు. తొలుత వీధిలో ఒకరిని చంపగా, ఆ ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరిపై ప్రత్యర్థి వర్గం అక్కడికి వెళ్ళి మరీ దాడి చేసి అంతమొందించడం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో నాందేడ్ డీ-మార్ట్ సమీపంలోని ఈ-స్వార్ వద్ద ఈ ఘోరం జరిగింది. అరిజిత్ సింగ్ చవాన్ (25) అనే యువకుడు సినిమా చూసి ఇంటికి తిరిగి వస్తుండగా, సయ్యద్ అవేజ్, సయ్యద్ ఖలీల్, మహమ్మద్ అర్బాజ్ మరికొందరు దుండగులు అతడిని చుట్టుముట్టారు. కత్తులు, బాకులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అరిజిత్ అక్కడికక్కడే మరణించాడు. ఈ గొడవలో నిందితులు సయ్యద్ అవేజ్, సయ్యద్ ఖలీల్, అర్బాజ్ కు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### ఆసుపత్రిలో 'ప్రతీకార' హత్యలు

తన సోదరుడు అరిజిత్ హత్యకు గురయ్యాడని, నిందితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న అరిజిత్ సోదరుడు ఆగ్రహంతో ఊగిపోయాడు. వెంటనే ఆసుపత్రికి చేరుకున్న అతను, అక్కడ వార్డులో ఉన్న సయ్యద్ అవేజ్ (27), మహమ్మద్ అర్బాజ్ (23)పై కత్తితో దాడి చేశాడు. పోలీసులు, సిబ్బంది చూస్తుండగానే ఈ దాడులు జరగడం, వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో ఆసుపత్రి ఆవరణ భయాందోళనలతో నిండిపోయింది.

### నేరచరిత్ర ఉన్న ముఠాలు

ఈ ఘటనలో పాల్గొన్న రెండు వర్గాలకు భారీ నేరచరిత్ర ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు అరిజిత్ సింగ్ చవాన్‌పై ఇప్పటికే 9 కేసులు నమోదై ఉన్నాయి. ఈ ముఠాల్లోని అనిల్ పంజాబీ ప్రస్తుతం జైలులో ఉండగా, సాహిల్ అనే మరో సభ్యుడు రెండు నెలల క్రితమే జైలు నుండి బయటకు వచ్చాడు. పాత కక్షలే ఈ దాడులకు ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం ఈ కేసులో భాగ్యనగర్ పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు పరస్పరం కేసులు నమోదు చేసుకున్నాయి. పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి విష్ణుపురి ప్రభుత్వ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అదనపు బలగాలను మోహరించారు.



# కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయండి

## ప్రభుత్వ విప్ కు వినతి పత్రం

**ప్రజానావ, కోనరావుపేట:** కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన మాదిగ సామాజిక చెందిన నాయకులు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం అందించారు. కమ్యూనిటీ హాల్ లేక చాలా కాలంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నమని మా సామాజిక వర్గానికి సంబంధించి శుభకార్యాలు జరుపుకోవాలన్నా, కుల సంఘ సమావేశాలు నిర్వహించుకోవాలన్నా సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమం లో సంఘ సభ్యులు తాళ్లపెల్లి అనిల్, కవ్వంపెల్లి గోవర్ధన్,వంతడ్పుల రాజు, తాళ్లపెల్లి మహేష్, తాళ్లపెల్లి జీవన్ పాల్గొన్నారు.

# పంటల లక్ష్యసాధనలో పంపు సెట్లదే కీలకపాత్ర

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి

### లక్ష్య సాధించిన టెక్స్ మో ఇండస్ట్రీస్ లో కేక్ కట్



**ప్రజానావ, సిరిసిల్ల :** పంటల లక్ష్య సాధనలో మోటార్ పంపు సెట్లు కీలకపాత్ర పోషిస్తాయని, ఆ దిశగా రైతుల సేవలో టెక్స్ మో ఇండస్ట్రీస్ టారో ముందున్నదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల టెక్స్ మో ఇండస్ట్రీస్ డీలర్ చింతోజు భాస్కర్ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రైతులకు పంపు సెట్స్ అందించడశీ లో లక్ష్యాన్ని సాధించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కేక్ కట్ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన మోటార్లను వినియోగించడం విద్యుత్తును ఆదా చేసుకోవాలని రైతులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల టెక్స్ మో డీలర్ చింతోజు భాస్కర్ (శ్రీసంతోష్ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ స్టోర్స్), చింతోజు నారాయణ, ఈష్ కుమార్, దుర్గేశ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

### ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బాధ్యుల సమావేశంలో ఐడీఓసీలో సమావేశం



**ప్రజానావ, సిరిసిల్ల :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. యాసంగి సీజన్ సందర్భంగా జిల్లా లోని 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆద్వర్యంలో 93 వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, సంఘాల కార్యదర్శులు, సెంటర్ల ఇంచార్జిలు, ట్యాబ్ ఆపరేటర్లతో కొనుగోలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం అదనపు కలెక్టర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్నీ రకాల మౌళిక సదుపాయాలను కల్పించాలని, కొనుగోలు కు సంబంధించిన పరికరాలను సమకూర్చుకోవాలని, నిబంధనల ప్రకారం దాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ నెల మొదటి వారంలో కేంద్రాలు ప్రారంభించాలని, అవసరమైన గన్ని బ్యాగ్స్ సమకూర్చాలని, కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ శిక్షణలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెస్ విలీనాన్ని అడ్డుకుంటాం

- ఊపిరి ఉన్నంతవరకు పోరాటం సాగిస్తాం
- సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో కలిపితే అగ్ని గుండమే
- "సెస్" ప్రతినిధుల మహాజన సభ తీర్మానం
- 262 గ్రామాల ఊపిరి సెస్ సంస్థ
- సెస్‌ను కాపాడుకునేందుకు జిల్లా ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలి
- సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు పిలుపు




**ప్రజానావ, సిరిసిల్ల :** ఐదున్నర దశాబ్దాలుగా దేశంలోనే విద్యుత్ సరఫరా లో ఉత్తమ సేవలు అందిస్తున్న సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ సెస్ ను కుట్రపూరితంగా ప్రభుత్వం ఎన్పీడీసీఎల్ లో విలీనం చేయడానికి పూనుకున్నదని, ఈ చర్యలను ముందుకు సాగనీయమని సెస్ ప్రతినిధుల మహాజన సభ హెచ్చరించింది. శనివారం స్థానిక మణికంట పంక్షన్ హాలులో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన సెస్ 52వ ప్రతినిధుల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా సెస్ ప్రతినిధులు పలు తీర్మాణాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా అమోదించారు. ప్రజల ఆస్తి అయిన సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థను తమ ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటామని సెస్ ప్రతినిధులు స్పష్టం చేశారు. రూ. వందల కోట్లు బకాయిలను ప్రభుత్వం సెస్ కు ఇవ్వకుండా నష్టాలలో ఉందంటూ సాకులు చూపి, ఎన్‌పీడీసీఎల్ సంస్థలో విలీనం చేయాలని ప్రయత్నం చేస్తున్నదని, అలా జరుగుతే సిరిసిల్ల ప్రాంతం అగ్ని గుండంగా మారుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సెస్ లైసెన్సు పునరుద్ధరించకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, బోర్డులో విలీనం కుట్రలను మహాజన సభ తీవ్రంగా గర్హించింది. ప్రజలు ఏర్పాటు చేసుకుని అయిదున్నర దశాబ్ధాలుగా సహకార రంగంలో మెరుగైన విద్యుత్ సేవలందిస్తూ పరస్పర సహకారంతో ముందుకు పోతున్న సెస్ వినియోగదారుల మెడపై కాంగ్రెస్ సర్కారు కత్తి పెట్టిందని ఆరోపించింది. సెస్ పరిధిలోని 262 గ్రామ పంచాయతీల నుంచి సెస్ విలీనాన్ని విరమించుకొని, లైసెన్సును పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ తీర్మాణాలు చేసిన ప్రతులను సభలో చైర్మన్‌కు ప్రతినిధులు అందజేశారు. సెస్ విలీనాన్ని అడ్డుకునేందుకు అవసరమైతే కోర్టుకెళతామని సభ తీర్మాణం చేసింది. ప్రజాధనం, ప్రజా ఆస్థులు, ప్రజలు ఏర్పాటు చేసుకున్న సహకార సంస్థను ఎలా విలీనం చేస్తారంటూ ప్రశ్నించింది. సెస్ పై సర్కారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని ఈ సందర్భంగా మహాసభ పిలుపు నిచ్చింది. సెస్ పై చేస్తున్న కుట్రలు మానుకోవాలని హెచ్చరిస్తూ, సెస్ సంస్థను కాపాడుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని ప్రతినిధుల మహాజన సభ తీర్మాణం చేసింది.

## సెస్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత సభ్యులదే

### సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



సిరిసిల్ల ప్రాంత పెద్దలు ఎంతో కృషి చేసి స్థాపించిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్)ను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మహజన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్వార్థ పూరితంగా కొంత మంది కావాలని సెస్ పై అసత్యపు ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తూ వినియోగదారులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. సెస్ ను కాపాడుకునేందుకు జిల్లా ప్రజలు కలిసి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కోట్లాది రూపాయల ఆస్తులున్న సెస్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి సుమారు రూ. 700 కోట్లకు పైగా బకాయిలున్నట్లు తెలిపారు. బకాయిలు ఇవ్వకున్నా సెస్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు నెలనెలా చెల్లిస్తూ, సంస్థను అభివృద్ధిలో ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. వినియోగదారులకు, రైతులకు, పరిశ్రమలకు పారదర్శకంగా పాలక వర్గం సేవలందిస్తుందన్నారు. సెస్ లో అవినీతి జరిగిదంటూ దుష్ప్రచారం చేస్తున్న వారు నిరూపించాలని, దీనిపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తమ పాలకవర్గం ఎలాంటి అవినీతికి పాల్పడినా అందుకు దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థకు సంబందించి లైసెన్సు పునరుద్దరణ కోసం ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉందని, దీనిని పునరుద్దరించక పోవడమే కాకుండా, సంస్థలో ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించిందని పేర్కొన్నారు. అయిదున్నర దశాబ్ధాలుగా మెరుగైన సేవలందిస్తున్న సెస్, ఇది సిరిసిల్ల జిల్లా ప్రజలదని, సంస్థ ఆస్తులు వినియోగదారులవని స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయడాన్ని ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోమన్నారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. దీనిపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు, అన్ని గ్రామాల ప్రతినిధులు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రాల అనుసంధానమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో కాళేశ్వరం, యాదగిరిగుట్టకు బస్సు సర్వీసులు ప్రారంభం



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి కాళేశ్వరం, యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాలకు నూతన బస్సు సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. మున్సిపల్ పాలకవర్గం, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన జెండా ఊపి బస్సులను రోడ్డెక్కించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఒక పుణ్యక్షేత్రం నుండి మరో పుణ్యక్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం కనెక్టివిటీ పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ నేడు లాభాల బాటలో నడుస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని, దీనివల్ల వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటమే కాకుండా వ్యాపారాలు కూడా పుంజుకున్నాయని తెలిపారు. గతంలో వెలవెలబోయిన బస్టాండ్లు నేడు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించి వేములవాడతో పాటు సిరిసిల్ల, మెట్‌పల్లి, జగిత్యాల, కోరుట్ల డిపోల నుంచి బస్సుల సంఖ్యను పెంచాలని కోరినట్లు వెల్లడించారు.

## బస్టాండ్ల ఆధునీకరణ - భక్తులకు భరోసా

వేములవాడ బస్టాండ్ ఆధునీకరణ కోసం రూ. 1.60 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే కథలాపూర్, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట బస్టాండ్లను కూడా సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. తిప్పాపూర్ బస్టాండ్ తొలగింపు అంశంపై ఆయన స్పందిస్తూ.. "వేములవాడ పట్టణానికి తిప్పాపూర్ బస్టాండ్ ముక్కు లాంటిది. గతంలో దీనిని తొలగించాలని చూస్తే, మొదట జేసీబీని నాపై ఎక్కించాలని అడ్డుకున్నాను" అని గుర్తు చేశారు. వేములవాడ వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూనే, త్వరలోనే సిరికొండ వరకు బస్సు సర్వీసులను పెంచుతామన్నారు.

## రాజన్న ఆలయానికి మహర్దశ

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ఆది తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ఆలయాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని, భవిష్యత్తులో భద్రాచలం, బాసరకు కూడా నేరుగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రజలందరూ సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

## భక్తుల భద్రతే లక్ష్యం: ఆలయ ఈవో రమాదేవి




**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రజాపాలన 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రజారక్షణ (ఫైర్) శాఖ ఆధ్వర్యంలో వేములవాడ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఈ డ్రిల్‌ను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, మంటలను ఎలా అదుపు చేయాలి అనే అంశాలను ఫైర్ సిబ్బంది ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ఆలయ పరిసరాల్లో అగ్నిప్రమాదాలను ప్రాథమిక దశలోనే ఎలా నివారించవచ్చో వివరించారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ భద్రతను పర్యవేక్షించే తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఎలా ఆపరేట్ చేయాలో ఫైర్ సిబ్బంది ఎస్పీఎఫ్ వారికి క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ప్రమాద సమయంలో భయాందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా తగ్గించవచ్చో వివరించారు. దేవస్థానానికి నిత్యం వేల సంఖ్యలో వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి శిక్షణ తరగతులు నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ జవాన్లు, ఆలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాణం అమూల్యమైంది.. భద్రతకే ప్రాధాన్యం!

- విద్యుత్ విధుల్లో రక్షణ పరికరాలు తప్పనిసరి
- ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్



**ప్రజానావ, సిరిసిల్ల:** విద్యుత్ రంగంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో భద్రతా పరికరాల వినియోగం నిబంధన మాత్రమే కాదు.. అది ఒక బాధ్యత అని ఎన్పీడీసీఎల్ సీఈ (ఆపరేషన్) అశోక్ స్పష్టం చేశారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆయన, విద్యుత్ భద్రత, వినియోగదారుల సేవలు మరియు వ్యవస్థ మెరుగుదలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### 'పెప్ టాక్'తో సిబ్బందిలో అవగాహన

డివిజనల్ ఇంజనీర్ అంజయ్య ఆధ్వర్యంలో 33/11 కేవీ శివనగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన "పెప్ టాక్" కార్యక్రమంలో సిఈ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సిబ్బంది హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి రక్షణ పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని హెచ్చరించారు. ప్రతిరోజూ ఉదయం సెక్షన్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సిబ్బందికి భద్రతపై నిరంతర అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల సంతృప్తే లక్ష్యంగా ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) విభాగం పనిచేయాలని సూచించారు.

### రైతు ముంగిట 'పొలం బాట -- ప్రజా బాట'

రైతుల విద్యుత్ సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఎస్ఈ భిక్షపతి నాయకత్వంలో చేపట్టిన "పొలం బాట -- ప్రజా బాట" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోందని సిఈ తెలిపారు. ముస్తాబాద్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్వయంగా రైతులతో మాట్లాడారు. ప్రమాదకరంగా ఉన్న లూజ్ లైన్లు, వంగిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రతిపాదికన సరిచేయాలని అధికారులను ఆదేశించారు. బోయినపల్లి, సిరిసిల్ల టౌన్, వేములవాడ, వీర్నపల్లి తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ద్వారా రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు.

### ముస్తాబాద్ సబ్‌స్టేషన్ తనిఖీ

అనంతరం ముస్తాబాద్ 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను సిఈ తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్ యార్డ్ నిర్వహణను పరిశీలించి, ఓవర్‌లోడ్ సమస్య ఉన్న ఫీడర్ల వద్ద వెంటనే లోడ్ బదలాయింపు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. వినియోగదారులు ఎవరూ సొంతంగా విద్యుత్ పనులు చేయకూడదని, ఏ సమస్య ఉన్నా తక్షణమే అధికారులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వడ్డీ రక్కసి కోరల్లో రైతు

## లక్ష అప్పుకు రూ. 74 లక్షలు కట్టి.. కిడ్నీ అమ్ముకున్నా తీరని బాకీ!



**ప్రజానావ, ముంబై:** అక్రమ వడ్డీ వ్యాపారుల ఆగడాలు, యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి ఒక సామాన్య రైతును మృత్యు ముంగిటకు నెట్టాయి. తీసుకున్న లక్ష రూపాయల అప్పుకు ఏకంగా రూ. 74 లక్షలు చెల్లించి, ప్రాణాలకు తెగించి కిడ్నీ అమ్ముకున్నా.. వడ్డీ వ్యాపారుల వేధింపులు తగ్గకపోవడంతో ఆ రైతు సర్వం కోల్పోయాడు. చివరకు తనకు న్యాయం జరగదన్న నిరాశతో, 'స్వచ్ఛంద ఆత్మహత్య'కు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. చంద్రాపూర్ జిల్లా నాగ్భిడ్ తాలూకా మింథూర్‌కు చెందిన రోషన్ కుడే అనే రైతు కథనం వింటే గుండె రగిలిపోతుంది. గతంలో అత్యవసరాల నిమిత్తం వడ్డీ వ్యాపారుల వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. దానికి చక్రవడ్డీలు వేస్తూ వడ్డీ వ్యాపారులు అతడిని పీల్చిపిప్పి చేశారు. ఇప్పటివరకు కుడే ఏకంగా రూ. 74 లక్షలు చెల్లించినా వారి ఆకలి తీరలేదు. మానసిక వేదన భరించలేక, అప్పు తీర్చే మార్గం లేక కుడే కంబోడియా వెళ్లి తన 'కిడ్నీ'ని అమ్ముకున్నాడు. ఆ డబ్బును కూడా వడ్డీ వ్యాపారులకే కట్టాడు. అయినా కనికరించని ఆ మృగాలు, అతడికి ఉన్న సాగు భూమిని కూడా బలవంతంగా స్వాధీనం చేసుకున్నాయి.



### ముఖ్యమంత్రి ఆదేశాలూ బేఖాతరు


ఇటీవల మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుల ఆస్తులను తిరిగి ఇప్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకటనతో తన పొలం తిరిగి వస్తుందని ఆశపడ్డ కుడేకు నిరాశే ఎదురైంది. ఫిర్యాదు చేసి నాలుగు నెలలు గడిచినా, ముఖ్యమంత్రి ఆదేశాలు వచ్చి నెలన్నర అయినా జిల్లా యంత్రాంగం ఉలుకూ పలుకూ లేకుండా వ్యవహరిస్తోందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. "యంత్రాంగం మందకొడిగా ఉంది.. వడ్డీ వ్యాపారులు యథేచ్ఛగా తిరుగుతున్నారు" అని ఆయన ఆరోపించారు.

### న్యాయం లేనిచోట చావే శరణ్యం

తన తండ్రి వికలాంగుడని, ఉన్న భూమి పోవడంతో జీవనోపాధి కరువైందని కుడే కన్నీటిపర్యంతమయ్యాడు. "నేను సర్వస్వం కోల్పోయాను. న్యాయం చేయలేని పక్షంలో నన్ను, నా కుటుంబాన్ని ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతించండి.. లేదా ముంబై సెక్రటేరియట్ (సచివాలయం) ముందు ఆత్మాహుతి చేసుకుంటాను" అని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నాడు. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్న ఈ రైతు ఆవేదనను ఇప్పటికైనా ఆలకిస్తుందా? లేక మరో బలిదానానికి వేచి చూస్తుందా? అని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాలకు చెక్.. కలెక్టర్ పక్కా ప్లాన్!

- మీడియన్ ఓపెనింగ్స్ క్లోజ్.. రాంగ్ రూట్ వెళ్తే భారీ జరిమానా
- భద్రతా చర్యలపై అధికారులతో కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష



**ప్రజానావ, పెద్దపల్లి:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలపై సంబంధిత అధికారులతో ఆయన రివ్యూ నిర్వహించారు. జిల్లాలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా రంగంపల్లి రోడ్డు, మార్కెట్ యార్డ్, కునారం రోడ్డు, సుల్తానాబాద్ లోని వివిధ ప్రాంతాల వద్ద ఉన్న మీడియన్ ఓపెనింగ్ లను పది రోజుల పాటు మూసివేసి పరిశీలించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా రాంగ్ రూట్ ప్రయాణాల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి రాంగ్ రూట్ లో ప్రయాణించే వాహనదారులకు భారీగా జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. రహదారి పక్కన ఉన్న ఇటుక బట్టీల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీబ్రా క్రాసింగ్ లు, అద్దాల ఏర్పాటు రాఘవపూర్, సబ్బితం గ్రామాల వద్ద ప్రధాన రహదారిపై జీబ్రా క్రాసింగ్ లు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంథని ఫ్లైఓవర్ వద్ద అవసరమైన చోట్ల కాన్వెక్స్ మిర్రర్స్ అమర్చాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ట్రాఫిక్ సిఐ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతికి సర్వం సిద్ధం

### రాష్ట్ర పండుగగా ఘనంగా వేడుకల నిర్వహణ

### రేపు ఉదయం 10 గంటలకు విగ్రహానికి నివాళులు

**ప్రజానావ, పెద్దపల్లి:** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 5వ తేదీన రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి ఎం. రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో జయంతి వేడుకలను జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు పెద్దపల్లి పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మేధావులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ ప్రకటన విడుదల చేశారు.

# పేదల పెన్నిధి.. సీఎం సహాయనిధి

### ఎమ్మెల్యే ఆదేశాలతో లబ్ధిదారులకు చెక్కుల అందజేత

### పైరవీలకు తావు లేకుండా అర్హులకు నేరుగా సాయం



**ప్రజానావ, మద్నూర్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు పెద్ద ఎక్లరా గ్రామ సర్పంచ్ సోమవర్ మహేష్, మండల అధ్యక్షుడు దారస్ సాయిలు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల యోగక్షేమాలను తెలుసుకుంటూ వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని పేర్కొన్నారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ఈ పథకాన్ని పారదర్శకతతో అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. ఎవరికి ఏ ఆపద ఉన్నా స్వచ్ఛందంగా వచ్చి సంప్రదించాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దారస్ సాయిలు, మేనూర్ సర్పంచ్ అశోక్ పటేల్, సంగప్ప స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. హెల్త్ వీక్‌కు సిద్ధం!

### ఏప్రిల్ 6 నుంచి 11 వరకు భారీ స్థాయిలో అవగాహన సదస్సులు

### అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం



**ప్రజానావ, మెదక్:** మెదక్ జిల్లాలో ఏప్రిల్ 06 నుంచి 11 వరకు నిర్వహించనున్న హెల్త్ వీక్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ వారోత్సవాలను జిల్లా, గ్రామీణ స్థాయిల్లో ప్రజలందరి భాగస్వామ్యంతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చునని, ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎయిడ్స్, క్యాన్సర్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సి సెక్షన్లు, ఎనీమియా, మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చికిత్సకు దూరమైన వారిని గుర్తించి తిరిగి వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ఆరు రోజుల కార్యక్రమాలకు నోడల్ ఆఫీసర్లను నియమించాలని, విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీ సోమవారం నాడు మున్సిపల్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు 'ఈట్ రైట్ వాక్'ను పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో మహిళలు, విద్యార్థులు, వ్యాపారస్తులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డి సి హెచ్ శివదయాల్, జిల్లా విద్యాధికారి విజయ, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డి ఎస్ పీ ప్రసన్నకుమార్, డ్రగ్స్ నియంత్రణ అధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



